
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 19 సెప్టెంబరు 2024

కొత్తగూడెం కలెక్టరేట్‌లో కలకలం

- ఏసీబీ వలలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి కె.సూర్యనారాయణ
- రూ.1.14 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- డ్రిప్ పైపుల బిల్లుల చెల్లింపునకు ముడుపుల డిమాండ్
- విసిగి వేసారి పట్టించిన డిస్ట్రిబ్యూటర్లు



పట్టుబడిన సూర్యనారాయణ

కొత్తగూడెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి కె.సూర్యనారాయణ రూ.1.14లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. బుధవారం సాయంత్రం కొత్తగూడెంలోని కలెక్టరేట్ కార్యాలయంలోనే ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం. డ్రిప్ ఇరిగేషన్ కోసం వివిధ కంపెనీల నుంచి ప్రభుత్వం డ్రిప్ పైపులు తీసుకుని సబ్సిడీపై రైతులకు అందజేస్తుంది. ఇందుకోసం ఆయా కంపెనీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు జిల్లా హార్టికల్చర్ అధికారి క్లియరెన్స్ ఇవాల్సి ఉంటుంది. అయితే భద్రాద్రి జిల్లాకు సప్లయి చేసిన పైపులకు సంబంధించి క్లియరెన్స్ ఇచ్చేందుకు ఆయా కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు ముడుపులు చెల్లించాలని సూర్యనారాయణ డిమాండ్ చేస్తున్నాడు. గతంలో తాను మహబూబాబాద్‌లో పనిచేసిన సమయంలో ఓ కంపెనీ వారు లంచం డబ్బులు బ్యాలెన్స్ ఉంచారని, ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో బిల్లులకు ఆ కంపెనీవారు అదనంగా చెల్లించాలని ఒత్తిడి చేశాడు. మొత్తం రూ.1.14లక్షలు చెల్లిస్తేనే డ్రిప్ ఇరిగేషన్ బిల్లులకు క్లియరెన్స్ ఇస్తానని చెప్పడంతో సదరు కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లు ఏసీబీ డీఎస్పీ వై.రమేష్‌కు ఫిర్యాదు చేశారు.

దీంతో విచారణ జరిపిన ఏసీబీ అధికారులు లంచం వేధింపులను నిర్ధారించుకొని వ్యూహం పన్నారు. పథకం ప్రకారం కంపెనీకి చెందిన డీలర్ చేత రూ.1.14లక్షలను ఇచ్చి పంపారు. అతను బుధవారం సాయంత్రం కొత్తగూడెం కలెక్టరేట్‌లోని హార్టికల్చర్ విభాగంలోకి వెళ్లి జిల్లా అధికారి సూర్యనారాయణను కలవగా లంచం డబ్బులు తెచ్చావా.. అని ప్రశ్నించాడు. దీంతో డీలర్ తన వద్దనున్న రూ.1.14 లక్షల నగదును అందించాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు సూర్యనారాయణను పట్టుకున్నారు. అతడి నుంచి డబ్బును స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ రైడ్‌తో కొత్తగూడెం కలెక్టరేట్‌లోని అధికారులు ఉలిక్కి పడ్డారు. నూతన ఐడీఓసీలో తొలిసారిగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఓ జిల్లాస్థాయి అధికారి పట్టుబడటం తీవ్ర చర్చనీయాంశమైంది.

ఐటీ హబ్‌లో జాబ్ మేళా...



నగరంలోని ఐటీ హబ్‌లో టెక్ స్కై కంపెనీ బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన కనిపించింది. డిగ్రీ అర్హతతో రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా 450 మందిని రిక్రూట్ చేసుకున్నారు. సైబర్ సెక్యూరిటీ విభాగంలో వీరి సేవలను వినియోగించుకోనున్నారు. ఐటీ రంగంలో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు దక్కడంతో.. ఎంపికైన యువత ఆనందం వ్యక్తం చేసింది. ఖమ్మం జిల్లాకు చెందిన బత్తినేని ప్రకాష్ ఈ టెక్ స్కై కంపెనీని స్థాపించారు. ఇప్పటికే అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. - ఖమ్మం టౌన్

7

ప్రాణాలు ఫణంగా పెట్టి ఇలా...




ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై నుంచి ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర స్థితిలో ప్రయాణం సాగిస్తున్నారు. మున్నేరు వరదతో ఈ బ్రిడ్జి దెబ్బతినడంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు రాకపోకలు నిషేధించారు. అయితే ప్రమాదం అని తెలిసినా బైకర్లు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నుంచి బైక్‌లు నడుపుతున్నారు. బుధవారం ముదిగొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి బైక్ నడుపుతూ అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. బ్రిడ్జిపైనుంచి రాకపోకలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

'జమిలి' జంజాటం

కేంద్ర ప్రభుత్వ 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు

- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను వేర్వేరుగానే నిర్వహించాలంటున్న విపక్షాలు
- ప్రజాభిప్రాయం వ్యక్తీకరణకు అడ్డంకులు ఏర్పడతాయని వాదన
- వ్యయ ప్రయాసలు తగ్గి అభివృద్ధి పరుగులు పెడుతుందంటున్న బీజేపీ



జమిలి ఎన్నికల ప్రక్రియ మళ్లీ తెరపైకి రావడంతో జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, కేంద్రంలో లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతున్నందున ఆర్థికభారం అధికమవుతుందన్న కోణంతో పాటు ప్రభుత్వ పరిపాలన సమయం ఆదా అవుతుందన్న అభిప్రాయంతో కేంద్రప్రభుత్వం జమిలి ఎన్నికలకు సన్నాహాలు చేపట్టింది. అయితే జమిలి ఎన్నికల నిర్ణయంపై రాజకీయపక్షాల్లో భిన్నస్వరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం సాధ్యం కాదని, చెబుతుండగా బీజేపీ వంటి పార్టీలు మాత్రం అనుకూలంగా మాట్లాడుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నాటికి బలాబలాలు మారిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై చూపింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ 9 చోట్ల కాంగ్రెస్ భారీ ఆధిక్యత చూపించగా, భద్రాచలంలో బీఆర్ఎస్ ఆదిక్యత చూపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం బీఆర్ఎస్ ఓటమి చెందడంతో లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఓటుబ్యాంకుకు భారీగా గండిపడింది.

ఖమ్మం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ఓటమి ప్రభావం లోక్‌సభ ఎన్నికల తరుణంలో బీఆర్ఎస్ ఓటుబ్యాంకు కాంగ్రెస్, బీజేపీకి క్రాస్ కావడంతో బీఆర్ఎస్ గణనీయంగా దెబ్బతిన్నది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు మధ్య కాలపరిమితి తక్కువగా ఉండడంతో ప్రజల మనోభావాలు కూడా అసెంబ్లీ ఫలితాలకు అనుగుణంగా లోక్‌సభ ఫలితాల్లో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో భారీ ఆధిక్యతలతో మెజారిటీ చూపించారు. రెండు ఎన్నికలు ఒకేసారి జరిగితే బీఆర్ఎస్‌కు ఇంత నష్టం జరిగి ఉండేది కాదు. పరిస్థితులు ఎలా ఉన్నా.. కేంద్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయంతో జమిలి ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పక్షాల్లో భిన్నస్వరాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారం కోసం కుట్ర

పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు



వివిధ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బీజేపీ జమిలి ఎన్నికలను మళ్లీ తెరపైకి తెస్తోంది. లోక్‌సభ ఎన్నికలు వేరు, అసెంబ్లీ ఎన్నికలు వేరు. అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రాల సమస్యలకు అనుగుణంగా పార్టీల విధానాన్ని బట్టి ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తారు. దేశ రాజకీయ పరిస్థితులను బట్టి కేంద్రంలో ఆయా పార్టీల పోకడ, పరిపాలన గమనించి అధికారం ఇస్తారు. బీజేపీ రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం కష్టమని, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాకపోవడాన్ని గమనించి ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజలు బీజేపీకి ఈసారి గుణపాఠం చెప్పక తప్పదు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి



లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని కేంద్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దేశంలో ఒకేపార్టీ అధికారంలో ఉండాలనే స్వార్థంతో బీజేపీ ఈ ప్రయత్నం సాగిస్తోంది. గతంలో ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో వెనుకడుగు వేసింది. మళ్లీ రాజకీయ స్వార్థంతో ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. కేంద్రంలో ఎన్నికలు జరిగేటప్పుడు రాష్ట్రాల్లో అదే సమయంలో ఐదేళ్లు పూర్తిచేసుకుని ఎన్నికలకు వెళ్లే సమయం ఉండకపోవచ్చు.

రాష్ట్రాల హక్కులను హరించడమే

పోటు ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి



జమిలి ఎన్నికలు దేశంలో అమలు చేయాలని కేంద్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడం రాష్ట్రాల హక్కులను హరించడమే. దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పార్టీ పట్ట మొగ్గు చూపుతున్నారు. జాతీయస్థాయిలో ఎన్నికల సందర్భంలో అప్పటి పరిస్థితులను బట్టి ప్రధానపార్టీలకు అధికారం ఇస్తున్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్నది సరైన నిర్ణయం కాదు. ఇది రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

ఇది మంచి పరిణామం: తాండ్ర వినోద్‌రావు, బీజేపీ నాయకుడు



ఇది మంచి పరిణామం. ఎన్నికల ఖర్చు తగ్గుతుంది. పార్టీలకు, అభ్యర్థులకు కూడా ప్రచార ఖర్చు తగ్గనుంది. ప్రజలుకూడా ఒకేసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ హర్షిస్తుంది. లోక్‌సభ, రాజ్యసభలో కూడా మిగిలిన పార్టీలు మద్దతు ప్రకటించి జమిలి ఎన్నికల బిల్లుకు ఆమోదం తెలపాలని కోరుకుంటున్నా.

'మహిళా, శిశు' అధికారిగా లెనినా



ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 18: ఖమ్మం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిగా జె.స్వర్ణలత లెనినాను నియమిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సంక్షేమ అధికారిగా ఉన్న రాంగోపాల్‌రెడ్డికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బుధవారం బాధ్యతలు తీసుకునేందుకు వచ్చిన లెనినా కలెక్టర్‌ను కలవగా, కొంత సమయం ఆగాలని చెప్పినట్టు తెలిసింది. ఇదిలావుండగా లెనినా నియామకంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆమె భద్రాద్రి జిల్లాలో సీడీపీవోగా ఉన్న సమయంలో పలు అవినీతి ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. అనంతరం ములుగు జిల్లాకు బదిలీ చేశారు. కాగా, ఇటీవల తెలంగాణలోని కొందరు సీడీపీవోలకు ప్రమోషన్లు రాగా, అందులో లెనినా కూడా వున్నారు. ఆమెకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి ములుగు నుంచి ఖమ్మం డీడబ్ల్యూవోగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఖమ్మంలో విధుల్లో ఉన్న రాంగోపాల్‌రెడ్డి వచ్చి ఏడు నెలలు మాత్రమే అవుతోందని, ఇంతలోనే ఆయనను బదిలీ చేయడం ఏమిటని శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రేమ వంచనకు యువతి బలి

కూసుమంచి, సెప్టెంబరు 18: ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ యువకుడు చివరకు ముఖం చాటేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో వల్లెపు స్వాతి(19) ఇదేగ్రామానికి చెందిన బొల్లంసాయి ఏడాదిగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ వచ్చాడు. చివరకు ముఖం చాటేశాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఈనెల 16న ఇంట్లో పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. స్వాతి మృతికి కారణమైన బొల్లం సాయి, అతని తండ్రి వెంకన్న, తల్లి లక్ష్మి, అల్లుడు దిలీప్‌పై కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వరదలను ఎదుర్కొనేలా ప్రణాళిక

- ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్ ఏర్పాటు
- సాధారణ పౌరులకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ
- శాశ్వత టోల్ ఫ్రీ నెంబర్ 1077
- నగరంలో ఉన్న కాల్వల నిర్వహణకు చర్యలు
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



6

పెరిగిన విద్యుత్ వినియోగం

- పది రోజులుగా భానుడి భగ భగ... ఆపై ఉక్కపోత..
- రోజుకు 67లక్షల 49వేల యూనిట్ల వాడకం
- పది రోజుల్లో 7కోట్ల 6లక్షల 11వేల యూనిట్ల వాడకం
- గృహలక్ష్మి వినియోగదారులకు సబ్సిడీ చేజారే ప్రమాదం



రామ రామ.. ఇదేం ఖర్మ!



- గాడి తప్పుతున్న భద్రాద్రి ఆలయ ఉద్యోగుల తీరు
- లైంగిక వేధింపుల ఆరోపణలతో ప్రధాన అర్చకుడు, మరో అర్చకుడి సస్పెన్షన్
- కొన్నేళ్లుగా మితిమీరుతున్న సిబ్బంది పోకడలు
- కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇష్టారాజ్యం

భద్రాచలం, సెప్టెంబరు 18: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఆయన కుమారుడు, అర్చకుడు పొడిచేటి సీతారామంపై దేవాదాయ శాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేయడంతో గాడితప్పుతున్న ఆలయ ఉద్యోగుల తీరు మరోసారి తెరపైకి వచ్చింది. కోడలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవటం, ఈ విషయం దేవస్థానం అధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచారనే ఆరోపణలతో సీతారామానుజాచార్యులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇదే ఘటనలో దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్న ఆయన కుమారుడు సీతారామంపై సైతం కేసు నమోదు కావటంతో అతడిని కూడా సస్పెండ్ చేశారు. పోలీసు కేసు విషయం రెండు రోజుల క్రితం ఈ విషయం వెలుగులోకి రావటంతో దేవస్థానం అధికారులు ఈ విషయాన్ని దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే సీతారామానుజాచార్యులు, సీతారామంకు చార్జ్ మెమో జారీ చేశారు. తాజాగా దేవాదాయశాఖ కమిషనర్ ఈ విషయంపై సీరియస్ కావడంతో ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈవో రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

దేవస్థానం చరిత్రలో ఇదే తొలిసారి

భద్రాద్రి దేవస్థానం చరిత్రలో లైంగిక వేధింపులతో కేసు నమోదైన తొలి ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులేనని దేవస్థానం వర్గాలు తెలిపాయి. గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భాలు లేవని తెలిపారు. కాగా లైంగిక వేధింపుల ఆరోపణలపై దేవస్థానం ప్రధాన అర్చకుడిపైనే కేసు నమోదు కావటం తీవ్ర చర్చనీయాంశమైంది.

తొలినుంచీ వివాదాస్పదుడే..



సీతారామానుజాచార్యులు



సీతారామం

భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకుడిగా ఉన్న సీతారామానుజాచార్యులు వ్యవహార తీరు తొలినుంచి వివాదాస్పదంగానే ఉంది. గతంలో పలువురు వైదిక సిబ్బంది ఉద్యోగోన్నతుల విషయంలో అతడు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. అనువంశ అర్చకులకే అంతరాలయంలో పూజలు నిర్వహించే అవకాశం ఉండడంతో అతడు తన దత్తపుత్రుడు సీతారామంకు అవకాశం ఇవ్వాలని ప్రయత్నం చేయగా ఇతర అర్చకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. తొమ్మిదేళ్ల క్రితం అమ్మవారి ఆభరణాలు మాయమై ప్రత్యక్షమైన ఘటనలో సీతారామానుజాచార్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు రావడంతో అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని పర్ణశాల ఆలయానికి బదిలీ చేశారు. కాగా గతంలో మాడవీధుల అభివృద్ధికి స్థానికులు అధికసంఖ్యలో తమ ఇళ్లను ఇవ్వగా ఇతను మాత్రం దేవస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తూ దేవస్థానానికే స్థలం ఇవ్వడానికి నిరాకరించి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంపై విమర్శలు వెలువెత్తాయి. తాజాగా ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన ఖగోళయాత్ర సమయంలో దేవాదాయశాఖ, దేవస్థానం అధికారుల మార్గదర్శకాలను ఉల్లంఘించారనే ఆరోపణలతో తండ్రీకొడుకులిద్దరికీ అధికారులు చార్జ్‌మెమోలను జారీ చేశారు.

మితిమీరుతున్న పోకడలు

భద్రాద్రి దేవస్థానంలో కొందరు వైదిక, పరిపాలన సిబ్బంది పోకడలు మితిమీరుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత కాలం అవినీతి, అవకతవకలు, చేతివాటం ఆరోపణలు రాగా తాజాగా లైంగిక వేధింపుల వంటి అనైతిక ఆరోపణలతో దేవస్థానం పరువును మంటగలుపుతున్నారని (మిగతా 6వ పేజీలో)

నెరవేరనున్న కల..?


- ఖమ్మం జిల్లాలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుకు యోచన
- ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారుల ప్రతిపాదన
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో గతంలోనే ప్రకటన
- అన్ని విధాలా అనుకూలం కావడంతో ఖమ్మం వైపు మొగ్గు
- గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి రానున్న సాంకేతిక విద్య



ఖమ్మం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో యూనివర్సిటీ ఉన్న నేపథ్యంలో ఎలాంటి విద్యా యూనివర్సిటీ లేని ఖమ్మం జిల్లాలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) రాష్ట్ర ప్రభుత్వ ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో బాసరలో మాత్రమే ట్రిపుల్ ఐటీ నడుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటుచేశారు.

రాష్ట్ర విభజన తర్వాత నూజివీడు, ఇడుపులపాయ ఆంధ్రాలోకి వెళ్లగా తెలంగాణ బాసరలో ఆర్‌జీయూకేటీ రాష్ట్రానికి మిగిలింది. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీలుండగా మరో రెండు శ్రీకాకుళం, ఒంగోలులో ఏర్పాటుచేశారు. దీంతో నాలుగు ట్రిపుల్ ఐటీలు నడుస్తున్నాయి. తెలంగాణలో బాసరలో మాత్రమే ట్రిపుల్ ఐటీ ఒక్కటే ఉంది. ప్రతిఏటా 1500 మంది విద్యార్థులకు ఇక్కడ ప్రవేశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు పది జీపీఏ సాధించిన మెరిట్ విద్యార్థులకు మాత్రమే ఇక్కడ ప్రవేశాలు లభిస్తున్నాయి. ప్రతి ఏటా బాసర ట్రిపుల్ ఐటీకి 30వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తే 1500 మందికి సీట్లు లభిస్తున్నాయి. ఏపీలో ఒక్కో ట్రిపుల్ ఐటీకి 10వేల మంది విద్యార్థులు సీటుకోసం పోటీపడుతుండగా తెలంగాణలో 30వేల మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా అధికారంలోకి వస్తే కొత్త ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, మహబూబ్‌నగర్ (మిగతా 6వ పేజీలో)

వినియోగదారులకు నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగి చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే కూరగాయల ధరలు మూడు రెట్లు పెరిగి ప్రజలను బెంబేలెత్తిస్తుండగా వాటికి తోడు నిత్యావసర ధరలు సైతం కొండెక్కి వినియోగదారులకు మంటలు మండిస్తున్నాయి.



- రెండు నెలలుగా చుక్కలు చూపిస్తున్న వైనం
- కిలో రూ. 400 లు దాటిన వెల్లుల్లి
- రికార్డు స్థాయిలో కూరగాయల ధరలు
- మళ్లీ భగ్గుమన్న వంట నూనెలు
- ఒక్క రోజులోనే లీటర్‌కు రూ. 20 పెరిగిన వైనం
- వెంటనే ధరలు పెంచిన వ్యాపారులు
- వినియోగదారుల బెంబేలు

నిప్పుల్లా నిత్యావసరాలు...

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 18: మూడు నెలల క్రితం బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి రూ. 200ల వరకు ఉండగా ప్రస్తుతం కిలో వెల్లుల్లి రూ. 380 నుంచి రూ.400లకు చేరింది. గత ఏడాది క్రితం కిలో రూ. 60ల నుంచి రూ.70 లకు లభించిన పచ్చిశనగపప్పు ప్రస్తుతం కిలో రూ. 120లకు చేరింది. రెండు నెలల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే ప్రతి నిత్యావసర వస్తువుపై కిలోకు సుమారు రూ.20లు నుంచి రూ.40ల వరకు పెరగడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ రిటైల్ మార్కెట్‌లలో నిత్యావసర ధరలు కిలోకు రూపాయల్లో..

నిత్యావసర రకం	రెండు నెలల క్రితం	ప్రస్తుతం
కందిపప్పు	160	170- 180
పచ్చి శనగపప్పు	80	110 - 120
జీలకర్ర	300	350 - 400
ఎండుమిర్చీ	180	200 - 250
పామాయిల్	90	115 - 120
సన్‌ప్లవర్ ఆయిల్	110	125 - 130
పెసరపప్పు	110	130 - 140
మినపగుండ్లు	120	140 - 150
వెల్లుల్లి	300	380 - 400
అల్లం	60	240 - 250
ఇడ్లీరవ్వ	40	50- 55
ఉల్లిగడ్డలు	40	60 - 70

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతినడంతో కూరగాయల ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. గత నెల క్రితం కిలో రూ. 20 నుంచి రూ. 25 లకు లభించిన టమోటా ధర ప్రస్తుతం కిలో రూ.40 లకు చేరుకోగా, గత నెలలో రూ. 20 లకు దొరికిన కిలో వంకాయ రూ.66 నుంచి రూ. 70లకు పెరిగింది. ఇలా ప్రతి ఒక్క కూరగాయ రైతుబజార్లతో పాటు, భహిరంగ మార్కెట్లలో కిలో రూ.70 లకు పైగానే పలుకుతుంది. దానికి తోడు వెల్లుల్లి, ఉల్లి ధరలు సైతం పెరిగి వినియోగదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

భగ్గుమన్న వంట నూనెలు

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాలు భారీగా పెంచడంతో బహిరంగ మార్కెట్‌లో మళ్ళీ వంట నూనెల ధరలు భగ్గుమన్నాయి. ఒక్క రోజులోనే పామాయిల్, సన్‌ప్లవర్ నూనెలపై లీటర్‌కు రూ. 20 లకు పెరిగింది. దీంతో పామాయిల్ రూ. 120 లకి చేరుకోగా సన్‌ప్లవర్ లీటర్ రూ. 130 లకు చేరుకోవడం విశేషం. కాగా వేరుశనగ నూనె లీటర్‌కు రూ. 10లు పెరిగి రూ. 160 లకి చేరుకోగా ఆవాల (మస్టర్డ్‌ఆయిల్) నూనె సైతం రూ. 180కి ల వరకు చేరుకున్నాయి. అంతే కాకుండా కొబ్బరి నూనెల ధరలు సైతం పెరగడంతో వినియోగదారులకు కొంత ఆందోళన చెందుతున్నారు.

ధరలను వింటే భయమేస్తుంది

జంగాల సంజీవరావు, ఖమ్మం



ఇప్పటికే వరదలతో తీవ్రంగా నష్టపోయిన మాకు మార్కెట్‌లో నిత్యావసర సరుకులు కొనాలంటేనే భయమేస్తుంది. ప్రతి వస్తువు రేటు పెరిగింది. గతంలో కొన్న ధర కంటే రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోవట్లేదు. ఏ కూరగాయలు తీసుకుందామన్నా కేజీ రూ. 70 నుంచి రూ. 80 లు పై మాటే ఉంది.

ప్రస్తుతం రైతుబజార్, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయల ధరలు కిలోకు రూపాయల్లో..

కూరగాయలు	ధర
బీరకాయ	50-60
పచ్చిమిర్చీ	30-40
కాకరకాయ	50- 60
టమాటా	36-40
వంకాయ	50-60
బెండకాయ	30-40
పొట్లకాయ	50-60
దోసకాయ	30-40
గోరుచిక్కుడు	50-60
క్యాబేజీ	24-30
దొండ	60-70
సొరకాయ	50-60
క్యారెట్	50-60
క్యాప్సికం	70-80
ఆలుగడ్డ	40-50
ఉల్లిగడ్డ	70-80
కోడిగుడ్లు ట్రే	160-170
కొత్తిమీర కట్ట	60-70

చిన్నారుల సహాయ స్ఫూర్తి ప్రశంసనీయం

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 18: చిన్నతనం నుంచి ఇతరులకు సహాయం చేయాలనే మంచి హృదయంతో ఖమ్మం వరద బాధితుల కోసం చిన్నారులు చూపించిన సహాయ స్ఫూర్తి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు "నా ఖమ్మం కోసం నేను" అనే నినాదంతో కొణిజెర్లకు చెందిన సమతా సూపర్ జెమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు సేకరించిన 35 వేల రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన విద్యార్థుల సహృదయాలను ప్రశంసించారు. వరద బాధితులకు మనం అందించే సహాయం డబ్బు, వస్తువు రూపంలో వారికి సహాయ పడటమే కాకుండా విపత్కర సమయంలో సమాజంలోని ప్రజలంతా కలిసి మనకు సహాయం చేస్తున్నారనే ఆత్మస్థైర్యం బాధితుల్లో పెరుగుతుందని, వరద బాధితుల సహాయార్థంపై స్కూల్ విద్యార్థులు స్పందించడం పట్ల కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొణతం ఉమాశంకర్, ఉపాధ్యాయులు కంచేటి స్రవంతి, నంజాల సాయి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 22,23వ తేదీల్లో స్కేటింగ్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 18: జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22,23వ తేదీలలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో బాలుర, బాలికల స్కేటింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు స్కేటింగ్ కోచ్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి అక్టోబరు నెల 4 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 20 కల్లా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9912399211 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నవంబరు 24న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 18: 2024-25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబరు 24న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష రుసుం చెల్లింపు, దరఖాస్తులు ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకొనుటకు సెప్టెంబర్ 25 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

క్యాబ్ డ్రైవర్స్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబరు 18: కొత్తగూడెంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంచెర్ల జమలయ్య కోరారు. ప్రచార జీబు యాత్ర అశ్వారావుపేటకు చేరిన సందర్భంగా క్యాబ్ ఆటో అడ్డాలో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్డీ సలీమ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, పఠన్ జలాల్. చిన్నరావు, గన్నిన రామకృష్ణ, సైదా, రాయపూడి రాజేష్, ఏళ్లబోయిన కోటేశ్వరరావు, నూకవరపు విజయ్‌కాంత్, మల్లికార్జున్, మున్న రాము తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మికి రూ.లక్ష, తులం బంగారం ఇవ్వాలి

- ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ



మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

నేలకొండపల్లి,సెప్టెంబరు 18: కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటుగా తులం బంగారం ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. నేలకొండపల్లిలోని రావెళ్లభవన్‌లో బుధవారం జరిగిన సంఘం 6వ మండల మహాసభలో సరళ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బలుసు ప్రమీల అధ్యక్షతన జరిగిన మహాసభలో సరళ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను ప్రకటించిందని, ఆడపిల్ల వివాహానికి రూ.లక్షతో పాటుగా తులం బంగారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చి9నెలలవుతున్నా ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. దేశంలో మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళలు అనేక రకాల వేధింపులకు గురవుతున్నారని, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టటంలో ప్రభుత్వాలు విఫలవయ్యాయన్నారు. తమ సమస్యల సాధన కోసం మహిళలంతా ఐక్యంగా పోరాడినప్పుడే సాధ్యపడుతుందని సరళ అన్నారు. మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, నాయకులు సుమతి, ప్రభావతి, మున్నంగి లక్ష్మి, మంజుల, వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాసభలో సంఘం మండల అధ్యక్షురాలిగా బలుసు ప్రమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మందుల స్రవంతితో పాటుగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వరద ముంపు బాధితులకు 849 సర్టిఫికెట్లు

- దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18: మున్నేరు వరదల్లో ధ్రువపత్రాలు కోల్పోయిన విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతరులకు తిరిగి సర్టిఫికెట్లు అందించేందుకు ప్రారంభించిన దరఖాస్తుల స్వీకకరణ పూర్తయింది. ఏయే విభాగాల్లో సర్టిఫికెట్లు ఇవ్వాలో కేఎంసీ అధికారులు కలెక్టరేట్‌కు ఆన్‌లైన్‌లో వివరాలు పంపారు. మొత్తం 14 డివిజన్లు ముంపునకు గురి కాగా ఆయా ప్రాంతాల్లో ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 10వ తేదీ నుంచి ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. శనివారంతో క్యాంపులు ముగిశాయి. బుధవారం ఆన్‌లైన్ పూర్తి చేశారు. మొత్తం 849 మందికి ధ్రువీకరణ పత్రాలు అందనున్నాయి. వీటిలో రెవెన్యూశాఖ నుంచి 285, విద్యాశాఖ నుంచి 354, బ్యాంకు సంబంధిత 54, ఇతర పత్రాలు మరో 156 వరకు ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖలకు వాటిని పంపి సర్టిఫికెట్లు తెప్పించి మున్నేరు వరద బాధితులకు ఇవ్వనున్నారు.

సింగరేణిలో త్వరలో లాభాల బోనస్

- ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు ఆల్బర్ట్



మాట్లాడుతున్న ఆల్బర్ట్

కొత్తగూడెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో నుంచి కార్మికులకు త్వరలోనే బోనస్‌ను చెల్లించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు ఆల్బర్ట్ తెలిపారు. బుధవారం కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చెల్లించిన 32 శాతం కంటే అధికంగా పెంచటానికి యూనియన్ కార్యదర్శి జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యంతో చర్చలు నిర్వహించిన నేపథ్యంలో సంస్థ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. నికర లాభాలు ప్రకటించడమే కాకుండా 35శాతం చెల్లిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు అవడంతో కార్మికుల పిల్లల చదువులు ఇతర ఖర్చులు నిమిత్తం త్వరలో లాభాలు వాటా చెల్లిస్తే మంచిదన్నారు. గత ప్రభుత్వం వాటా చెల్లింపులో తీవ్ర జాప్యం చేయ్యడంతో కార్మికులు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, వీలైనంత త్వరలో లాభాల బోనస్‌ను చెల్లించటానికి సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సింగరేణి అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన సంఘం కార్మికుల సమస్యలను విస్మరించి పైరవీల ముసుగులో 9 నెలలు కాలం గడిపిందని అన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పితాంబరం అభిషేక్, మహేష్, గౌస్, బి.రాజశ్వేర రావు, భీముడు, శ్రీను, నాగిరెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు

అడవిని నరికితే కఠిన చర్యలు తప్పవు

- సీఎఫ్‌వో భీమా నాయక్, డీఎఫ్‌వో కృష్ణయ్య గౌడ్



మొక్కలను పరిశీలిస్తున్న సీఎఫ్‌వో

కరకగూడెం, సెప్టెంబరు 18: అడవులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొత్తగా ఎవరైన అడవులను నరికితే కఠిన చర్యలు తప్పవని అటవి శాఖ జిల్లా అధికారులు సీఎఫ్‌వో భీమా నాయక్, డీఎఫ్‌వో కృష్ణయ్యా గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రాయణపేట రేజింగ్ ప్లాంటేషన్ కంపాట్ నెంబర్ 25లో అటవి శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నాటిన మొక్కలను పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవులను, వన్య ప్రాణులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వీటిపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడాలని తెలిపారు.

సమ్మెతో ఆగిన రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు



సమ్మెలో పాల్గొన్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 18: రాజీవ్ ఆరోగ్యశ్రీ లో పని చేస్తున్న ఆరోగ్యమిత్రలు సమ్మెబాట పట్టారు. బుధవారం నిర్వహించిన సమ్మెలో ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలి చాలని జీతాలతో బతుకు భారంగా మారిందన్నారు. 17 సంవత్సరాలుగా వెట్టి చాకిరి చెపిస్తు క్యాడర్ మార్పు, ఉద్యోగ భద్రత, ట్రస్ట్ ఉద్యోగులు కోసం ఎన్నో సార్లు వినతి పత్రాలు ట్రస్ట్‌కి , ఆరోగ్య మంత్రికి వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ బుధవారం నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఆరోగ్య మిత్రలు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో అన్ని ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం

రోజుకు 67లక్షల 49వేల యూనిట్ల వాడకం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18: గత పది రోజులుగా ప్రజలు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10.30గంటలకే భానుడు భగ భగమంటున్నాడు. దీంతో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎండ, ఉక్కపోత తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో నివాసాల్లోని ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఇతర విద్యుత్ పరికరాలు ఆగకుండా నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గృహ విద్యుత్ నుంచి వ్యవసాయ, వ్యాపార విద్యుత్ వరకు గణనీయంగా పెరిగింది. విద్యుత్ మీటర్లు నాన్‌స్టాప్‌గా పరుగులు పెడుతున్నాయి.

పెరిగిన వినియోగం

జూలై నుంచి పత్తి, వరి, మిర్చి పంటల సాగు మొదలు కావటంతో సెప్టెంబరులో వ్యవసాయ సీజన్ ప్రారంభమై అక్టోబరు, నవంబర్‌లో అత్యధిక వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సమయంలో వాతావరణం చల్లబడి ప్రతి ఏడాది గృహ విద్యుత్ వినియోగం తగ్గుతోంది. కానీ గత పది రోజులుగా విద్యుత్ వినియోగం గతానికి భిన్నంగా నమోదవుతోంది. ఒకే సమయంలో ఇటు గృహ విద్యుత్‌తోపాటుగా వ్యవసాయ విద్యుత్ పెరిగింది. అయినా విద్యుత్ కోతలు రాకుండా విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ నిల్వల సామర్థ్యాన్ని పెంచారు.

గతేడాది కంటే..

గతేడాది ఇదే సీజన్‌లో గృహ విద్యుత్ వినియోగం తగ్గి వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరగటంతో రోజు వారీగా సరాసరిగా 30లక్షల విద్యుత్ వాడకం నమోదైంది. కానీ ఇప్పుడు మాత్రం ఈనెల 1వ తేదీన 21లక్షల 31వేల విద్యుత్ యూనిట్ల వినియోగం నమోదు కాగా 14వ తేదీన మాత్రం గణనీయంగా 54లక్షల 87వేల యూనిట్లు, 15న 61లక్షల 33వేల యూనిట్లు, 16న 62లక్షల 16 యూనిట్లు, 17న 67లక్షల 49వేల యూనిట్లు నమోదు జరిగి విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డును నమోదు చేసింది. సెప్టెంబరు నెలలో ఇప్పటివరకు 7కోట్ల 6లక్షల 11వేల యూనిట్లు వినియోగం నమోదైంది. గృహజ్యోతి పథకంలో జిల్లాలో 200 యూనిట్ల లోపుగా విద్యుత్ వినియోగం చేస్తూ 2,53,891మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ పథకాన్ని పొందుతున్నారు. అయితే పెరిగిన ఉక్కపోత, ఎండ తీవ్రతతో గృహజ్యోతి విద్యుత్ వినియోగదారుల మీటర్లు కూడా పరుగులు పెట్టాయి. దీంతో వచ్చే నెలలో విద్యుత్ రీడింగ్ నమోదులో గృహజ్యోతి లబ్ధిదారులకు బిల్లుల షాక్ తగలనుంది. 200 యూనిట్లుకుపైగా విద్యుత్ వినియోగం చేసిన లబ్ధిదారులు సబ్సిడీ కోల్పోయే ఇబ్బంది ఏర్పడనుంది.

వరదలను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రణాళిక

- ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్ ఏర్పాటు
- సాధారణ పౌరులకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ
- శాశ్వత టోల్ ఫ్రీ నెంబర్ 1077 ఏర్పాటు
- నగరంలో ఉన్న కాల్వల నిర్వహణకు చర్యలు
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కరుణగిరి చర్చ్ యాజమాన్యంతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 18: భవిష్యత్‌లో భారీ వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీగా సన్నద్ధం కావాలని, వరదల సమయంలో పాటించాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, మున్నేరు వరద ప్రభావిత ప్రాంతమైన కరుణగిరిలో బుధవారం ఆయన పర్యటించారు.

సెయింట్ జోసఫ్ మేజర్ సెమినార్ చర్చ్ హాల్‌లో చర్చ్ క్రిస్టియన్ సంబంధిత యాజమాన్యం, అధికారులతో కలిసి ఇటీవల వచ్చిన వరదల వల్ల కలిగిన నష్టాలు, భవిష్యత్తులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కరుణగిరి అనాథ ఆశ్రమం, అంధులు, మూగవారికి సంబంధించిన జ్యోతి నివాస్ స్కూల్ ప్రాంతంలో వరదలు వచ్చినపుడు ఉన్న పరిస్థితి, నీరు ఏ స్థాయి వరకు వచ్చింది, ప్రాణ సంరక్షణకు తీసుకున్న చర్యలు.. గతంలో ఈ స్థాయి వరదలు ఎప్పుడైనా వచ్చాయా, భవిష్యత్తులో వచ్చే వరదల వల్ల కలిగే నష్టాల నివారణ, వరదల సన్నద్ధతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు.

కలెక్టర్ మాట్లాడుతూ గంటల వ్యవధిలో కుంభవృష్టి వర్షం పడటం, పరివాహక ప్రాంతాల్లో ఉన్న చెరువులు, ప్రాజెక్టులు అప్పటికే నిండుకుండలా తయారు కావడం, పై నుంచి పెద్ద ఎత్తున వరద రావడం, లకారం చెరువు నిండి ప్రవహించడం మొదలగు కారణాల వల్ల మున్నేరు నదికి గతంలో ఎన్నడూ లేనంతగా భారీగా వరదలు వచ్చాయన్నారు. దాదాపు 40అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని మొదటి అంతస్తు వరకు నీళ్లు వచ్చాయన్నారు.

భవిష్యత్తులో సైతం ఇటువంటి వరదలు వచ్చినప్పుడు పాటించాల్సిన పద్ధతులపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ రూపొందించుకుని దానిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. కరుణగిరి ప్రాంతం పరిసరాలలో వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వరదలు వస్తే ఎతైన ప్రాంతాలు ఏవి, ఏ భవనంలోకి వెళ్లాలి, ఇక్కడ ఉన్న అంధుల పాఠశాల విద్యార్థుల తరలింపు బాధ్యత ఎవరు తీసుకోవాలి మొదలగు అంశాలకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలన్నారు. వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వరదల వంటి విపత్కర సమయంలో వినియోగించేందుకు వీలుగా శాశ్వతంగా 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లాలో ఆసక్తిగల సాధారణ పౌరులను ఎంపిక చేసుకుని విపత్కర సమయంలో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవసరమైన శిక్షణ అందజేసి వలంటీర్లను సిద్ధం చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న కాల్వలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా కొంత మేర వరద ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలైన కరుణామయ అనాథ ఆశ్రమం, జ్యోతి నివాస్ స్కూల్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, చర్చి రెక్టార్ జయరాజు, సుధాకర్, సురేష్, విజయ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామ రామ.. ఇదేం ఖర్మ!

(5వ పేజీ తరువాయి)

భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానంలో జానకీ సదనం నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని నమ్మబలికి దేవస్థానంలో పనిచేసే ఓ అధికారి ఆధ్యాత్మిక బృంద సభ్యుల నుంచి రూ.18లక్షలు ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా సేకరించి దేవస్థానం ఖజానాకు జమ చేయకపోవటం విమర్శలకు తావిచ్చింది. ఈ ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని గత మే 11న ఈవో సస్పెండ్ చేశారు. అలాగే దేవస్థానంలో ప్రొవిజనల్ స్టోర్స్‌లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తటంతో ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా గతంలో దేవస్థానంలో కీలకంగా వ్యవహరించిన ఒక తాత్కాలిక ఉద్యోగి నుంచి రూ.లక్ష రికవరీ చేసి దేవస్థానం ఖజానాకు జమ చేశారు. తాజాగా ఆలయ ప్రాంగణంలో ఉన్న టిక్కెటు కౌంటర్‌లో ఒక ఉద్యోగి లక్షల్లో నగదును సొంతంగా వాడుకుని తిరిగి చెల్లించకపోవటంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవటంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

నెరవేరనున్న కల..?

(5వ పేజీ తరువాయి)


జిల్లాల్లో రెండు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఖమ్మంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు ద్వారా పదో తరగతి తర్వాత ఆరేళ్ల పాటు ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్య రెసిడెన్షియల్ పద్ధతిలో పొందే అవకాశం కలుగుతుంది. ఇందులో రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్లపాటు ఇంజనీరింగ్ విద్యాబోధన సాగుతుంది. పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు అడ్మిషన్ లభిస్తే ఆరేళ్లు ఒకే క్యాంపస్‌లో ఇంటర్‌తో సమానమైన పీయూసీ, నాలుగేళ్ల బీటెక్ కోర్సులలో ఇంజనీరింగ్ పూర్తిచేసే సౌలభ్యం కలుగుతుంది. తక్కువ ఫీజులతో అత్యున్నత సాంకేతిక విద్య పొందే అవకాశం ఉంటుంది.

ఆర్‌జీయూకేటీ పెట్టాలంటే...

ఆర్‌జీయూకేటీ ఏర్పాటు చేయాలంటే కనీసం వంద నుంచి 150 ఎకరాల స్థలం అవసరం ఉంటుంది. విద్యార్థులు కో ఎడ్యుకేషన్ పద్ధతిలో ప్రత్యేక హాస్టల్స్, ప్రత్యేక భవనాలు, ల్యాబులు, క్రీడా మైదానాలు, ఆడిటోరియం వంటి సదుపాయాలు సమకూర్చాల్సి ఉంది. పూర్తిస్థాయి భవనాలు, ల్యాబులు నిర్మించాలంటే రూ.400 కోట్ల నుంచి 500 కోట్లమేర నిధులు అవసరం ఉంటుంది. దీంతో పాటు ప్రతీఏటా విద్యార్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యాబోధన అధ్యాపకులు, సిబ్బంది వేతనాలు అన్ని కలిపి ఆర్‌జీయూకేటీ యూనివర్సిటీ నిర్వహించాలంటే ఏటా రూ.100కోట్ల వరకు నిధులు అవసరం ఉంటుంది. ఖమ్మం లాంటి ప్రదేశంలో యూనివర్శిటీ ఏర్పాటు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థులకు, ప్రొఫెసర్లకు రైల్వే, బస్సు రవాణ చేరువలో ఉండనుంది.

72 గంటలుగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం

1300లకు పైగా విగ్రహాల నిమజ్జనం



భద్రాచలం, సెప్టెంబరు 18: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. 16న ప్రారంభమైన నిమజ్జనం బుధవారం రాత్రి సైతం కొనసాగుతోంది. గత 72 గంటలుగా 1,300 విగ్రహాలు నిమజ్జనమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు తరలిరావడం జరిగింది. కొత్తగూడెం నుంచి విగ్రహాలు అధిక సంఖ్యలో తరలిరావడం విశేషం. ఈ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మూడు రోజులుగా నీటిపారుదల శాఖ, దేవస్థానం, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది షిఫ్ట్‌ల పద్ధతిన విధులను నిర్వహిస్తున్నారు. 6 క్రేన్లతో, 3లాంచీలతో విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో వారు నిరాంటకంగా విధులు నిర్వహిస్తున్నారు.


ఎమ్మెల్యే రాగమయికి నగదు అందిస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు

'మన ఖమ్మం కోసం మనం'కు విశేష స్పందన

ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 18: ఖమ్మం మున్నేరు బాధితుల సహాయార్థం నిర్వహిస్తున్న కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా విశేష స్పందన వస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. బుధవారం పలు సంఘాల నుంచి వితరణలు అందాయి. మండలంలోని తుంబూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.62వేలు, సత్తుపల్లి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.55వేలు, తల్లాడ మండల నాయకులు రఘుపతిరెడ్డి, శేషభూషణం, వేమిశెట్టి నాగేశ్వరరావులు రూ.10వేలతో పాటు 10క్వింటాళ్ల బియ్యం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన ఎంపీడీవోకు షోకాజ్ నోటీసులు

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ముదిగొండ, సెప్టెంబరు 18: విధులకు గైర్హాజరైన ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి షోకాజ్ నోటీసులు, సీనియర్ అసిస్టెంట్ ఆర్.బాలాజీ తూల్జాసింగ్‌ను సస్పెండ్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ జడ్పీ సీఈవోను ఆదేశించారు. బుధవారం ముదిగొండ పర్యటనలో భాగంగా ఎంపీడీవో కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించారు. ఆ సమయంలో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్ రాలేదని సిబ్బంది చెప్పటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీడీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

జాబ్‌మేళాకు భారీ స్పందన

- ఐటీహబ్‌కు హాజరైన 1500 మంది..
- ఎంపికైన 450 మంది అభ్యర్థులు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 18: ఐటీరంగం ప్రస్తుతం ఒడిదుడుకులు ఎదుర్కోవటం, కొత్త నియామకాలు లేకపోవటం జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మంలోని ఐటీహబ్‌లో టెక్‌స్కై ఎల్ఎల్‌సీ కంపెనీ బుధవారం భారీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ ఉద్యోగాల కోసం సుమారు 1500మంది అభ్యర్థులు హాజరయ్యారు. డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ తదితర విద్యార్హతలున్న వారు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, బుధవారమే వారిని నియమించుకున్నారు. రాతపరీక్ష, ముఖాముఖీల ఆధారంగా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టారు. నూతనంగా విద్య పూర్తి చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇచ్చారు. టెక్‌స్కై కంపెనీ అధినేత బత్తినేని ప్రకాష్ పర్యవేక్షణలో ఉద్యోగ నియామక పరీక్ష నిర్వహించారు. ఈసారి టెక్‌స్కై కంపెనీ ఐటీహబ్‌లో సైబర్ సెక్యూరిటీ విభాగాన్ని ప్రారంభించి, అందులో ఉద్యోగుల నియామక ప్రక్రియ చేపట్టడంతో సుమారు 450మంది అభ్యర్థులకు ఖమ్మం, హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఉద్యోగం పొందినవారు, ఇంటర్వ్యూలకు హాజరైన వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా, ఖమ్మంలోనే ఉండి, స్థానికంగా ఐటీ ఉద్యోగం సంపాదించడం తమకెంతో ఆనందంగా ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో తొలి ఉద్యోగంలో ఇచ్చే రూ.20వేల వేతనం ఖమ్మం ఐటీహబ్‌లో ఇస్తున్నారని పేర్కొంటున్నారు.


పేర్లు నమోదు చేసుకునేందుకు బారులు తీరిన అభ్యర్థులు

ఉన్న ఊళ్లోనే ఐటీ ఉద్యోగం: జి.నవనీత



ఉన్న ఊళ్లోనే ఐటీ కంపెనీలో ఉద్యోగం దొరకడం ఎంతో సంతృప్తిని ఇస్తోంది. తల్లిదండ్రులకు దగ్గరగా ఉండొచ్చు. ఎక్కడో దూరంగా ఉండి ఉద్యోగాలు చేస్తే కుటుంబసభ్యులకు దూరంగా ఉంటాం. ఇక్కడే జాబ్ చేస్తే వారికి ఆందోళన కూడా ఉండదు.

దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేసినా... ఈ.రక్షణ్



దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేసినా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రూ.60వేల నుంచి రూ.70వేల వరకు నెల వేతనం వచ్చినా, ఉద్యోగం లభించిన కంపెనీకి వెళ్లాలంటే వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుంది. ప్రతిరోజు ఇదే పరిస్థితి. ఖమ్మంలోని ఐటీహబ్‌లో ఉద్యోగం వల్ల ఎటువంటి ప్రయాసలు ఉండవు.

డిగ్రీ అర్హతతోనే ఉద్యోగం: ఎం.అశోక్



ఖమ్మం ఐటీహబ్‌లో డిగ్రీ విద్యార్హతతోనే ఉద్యోగాలు లభించటం వల్ల స్థానికంగా ఐటీ కంపెనీలో పనిచేయ గలుగుతున్నాం. బీకాం చదివినా టెక్‌స్కై కంపెనీ నూతనంగా ప్రారంభించిన సైబర్ సెక్యూరిటీ విభాగంలో అవకాశాలు కల్పించటం వల్ల డిగ్రీ అర్హతతోనూ మంచి ఉద్యోగం సాధించగలగటం ఎంతో సంతోషంగా ఉంది.

మంచి అవకాశాలు కల్పిస్తున్నారు: జి.వరలక్ష్మి



ఖమ్మం ఐటీహబ్‌లో మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. బీటెక్ విద్యార్హత కలిగిన అభ్యర్థులతో సమానంగా డిగ్రీ విద్యార్హత కలిగిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి. అర్హతను బట్టి సైబర్ సెక్యూరిటీగా, రిక్రూటర్‌గా అవకాశాలు కల్పిస్తున్నారు. ఉన్న ఊళ్లోనే మంచి ఉద్యోగం రావటం ఎంతో సంతృప్తినిస్తోంది.

ఆడపిల్లలను దూరంగా పంపలేక: పి.దివ్య



ఆడపిల్లలను ఉద్యోగాల పేరుతో దూరప్రాంతాలకు పంపటం అమ్మానాన్నలకు ఇష్టం లేదు. అందులో డిగ్రీ మాత్రమే ఉంటే చాలీచాలని వేతనం వస్తుందని, ఇబ్బందులు పడతామని అంటున్నారు. కానీ ఖమ్మంఐటీహబ్‌లో ఎన్నో మంచి అవకాశాలు ఉండటంతో స్థానికంగానే ఉద్యోగం వల్ల తల్లిదండ్రులు నిశ్చింతగా ఉంటున్నారు. ఐటీహబ్‌లో ఉద్యోగానికి వెళ్లమని వారే ప్రోత్సాహించారు.

స్థానికంగా ఉద్యోగంతో ఎంతో హాయి: ఎన్.జశ్వంత్



బీటెక్ చదివా. హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నా. స్థానికంగా ఉన్న ఉద్యోగంతో ఎంతో హాయి. కుటుంబ సభ్యులతో గడుపుతూ ఇక్కడే ఉద్యోగం చేసుకోవచ్చు. బస్సుల్లో గంటల తరబడి ప్రయాణం చేసే ఇబ్బంది ఉండదు. హైరానా లేకుండా ఇంటి భోజనంతో ఐటీ ఉద్యోగం సమర్థవంతంగా చేసుకోవచ్చు.

గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి...

- 28న గ్రామ పంచాయతీల్లో ఓటర్ల తుది జాబితా
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 18: గ్రామ పంచాయతీకి గ్రామస్థాయిలో ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ కోరారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 13న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి, ఆయా పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను సెప్టెంబరు 21లోపు సంబంధిత మండలాల ఎంపీడీవోలకు లిఖితపూర్వకంగా అందించాలని, సెప్టెంబరు 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబరు 28న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదుకు సెప్టెంబరు 21 వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని, ఓటరు జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీపీవో ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బుర్ర ఉపేంద్ర, ఎన్.వీరబాబు, ఎస్.నవీన్‌రెడ్డి, ఏ.గోపాల్‌రావు, కృష్ణప్రసాద్, తాటి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నూరుశాతం కొత్త ఓటర్లు నమోదు కావాలి

ఓటరు నమోదు ఇంటింటి సర్వేపై కమిషనర్ అభిషేక్ సమీక్ష


రెవెన్యూ, కేఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈనెల చివరి వరకు 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి నూరు శాతం ఓటరు నమోదు జరిగి ఓటు హక్కు కల్పించాలని, ఈనెల చివరి వరకు ఓటరు కార్డులోని తప్పొప్పుల సవరణ చేసి స్థానికంగా లేని ఓట్లను పరిశీలించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం కేఎంసీలో రెవెన్యూశాఖ, కేఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత నెల 20న ప్రారంభమైన ఇంటింటి ఓటరు కార్డు సర్వే పనితీరుపై సమీక్షించారు. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు ఇంటి వద్దనే తక్షణం తప్పొప్పులు సవరణ చేపట్టాలని ఆదేశించారు. ఆర్వో శ్రీనివాసరావు, తహసీల్దార్లు లూథర్‌విల్సన్, సీహెచ్ స్వామి, డిప్యూటీ తహసీల్దారు కల్పన, బిల్ కలెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ పరిష్కార ప్రక్రియను వేగిరం చేయండి



జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్

ఖమ్మం లీగల్ సెప్టెంబరు 18: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కోసం కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఆదేశించారు. జిల్లాలోని సత్తుపల్లి, మధిర, న్యాయాధికారులతో ఆయన బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలు అయిపోయిన నేపథ్యంలో పోలీసు అధికారుల సహకారంతో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులను పరిష్కరించాలని సూచించారు. క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసుల వంటి వాటికి ప్రాముఖ్యం ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా భార్యాభర్తలకు సంబంధించి ఒక కేసును పరిష్కరించినట్లయితే వాటికి అనుబంధంగా ఉన్న ఇతర కేసులు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

రివైజ్డ్ పెన్షన్ అమలు చేయాలి

ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్

మణుగూరు, సెప్టెంబరు 18: సింగరేణిలో 60ఏళ్లకి సీఎంపీఎఫ్ ముగుస్తోంది. అదనంగా పెరిగిన ఓ ఏడాదికి సంబంధించి సీఎంపీఎఫ్ పెన్షన్‌ను మాజీ కార్మికులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని రివైజ్డ్ పెన్షన్ వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు ఏరియాలో స్థానిక అధికారుల పూర్తిస్థాయి నిర్లక్ష్య వైఖరుల వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. 21వ వేజ్ బోర్డు మూడేళ్లు దాటుతున్నా రివైజ్డ్ పెన్షన్ విషయంలో ఇంకా నిర్లక్ష్యం వెంటాడుతోందన్నారు. దీని ద్వారా మూడు నుంచి 10వేల వరకు ప్రతి కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నోమార్లు చెప్పినా యాజమాన్యం పెడిచెవిన పెట్టడం ఏమాత్రం సరికాదన్నారు. ఇప్పటికైనా మార్పు రాకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సర్వర్, ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

సామగ్రి ధ్వంసం.. కేసు నమోదు

ఖమ్మంక్రైం,సెప్టెంబరు18: దానవాయిగూడెంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువరిపై కేసు నమోదుచేసినట్లు ఖానాపురంహవేలి పోలీసులు బుధవారం తెలిపారు. ప్రాంతానికి చెందిన పలువురు ఇళ్లపై గణేష్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో ఘర్షణకు దిగారు. దీంతో కొంతమంది ఇళ్లపై బయ్యా సందీప్, బయ్యా ఈశ్వర్, ఎస్‌కే సైదా, కిన్నెర మణి, ఇండ్ల సూరి అనే వారు చిటిక వినయ్ ఆయన తల్లి స్నేహలత అనేవారిపై దాడి చేశారు. తర్వాత ఇంట్లోని సామగ్రిని సైతం ధ్వంసం చేయడంతో బాధితులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

భద్రాచలం, సెప్టెంబరు 18: భద్రాచలం తోపాటు చుట్టు పక్కల వరుస బైక్ దొంగతనమునకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక మోటార్ సైకిల్, ఒక సెల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో మొదటి వ్యక్తి బూర్గంపాడు మండలం సారపాక గాంధీనగర్‌కి చెందిన అద్దంకి రాఘవన్ గౌతమ్, రెండో వ్యక్తి సాగరపాక గాంధీనగర్ ఒడియా క్యాంపునకు చెందిన కోసలా మిథున్ గా గుర్తించారు. వీరు మరొకరితో కలిసి నిలిపి ఉంచిన మోటార్ సైకిల్‌ను, సెల్ ఫోన్లను దొంగిలించి, వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు కి పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. దొంగలను పట్టుకొని వారి వద్ద నుంచి బైక్ ను, సెల్ ఫోన్ స్వాధీనపరుచుకొని ఇద్దరిని రిమాండ్ కి తరలించి పరారి లో ఉన్న ఇంకో దొంగ గురించి గాలింపు చేస్తున్నాం అని పోలీసులు తెలిపారు. దొంగలు ని పట్టుకోవడం లో సహాయపడిన తోటి సిబ్బంది ని భద్రాచలం ఎస్‌హెచ్‌వో సంజీవ రావు అభినందించారు.

బస్టాండ్ ఆవరణంలోని బైక్ చోరీ

తల్లాడ, సెప్టెంబరు 18: తల్లాడ బస్టాండ్ ఆవరణంలో బుధవారం ఆర్టీసీ కండక్టర్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ తుటారి రమేష్ బైక్‌ను తల్లాడ బస్టాండ్ ఆవరణంలో పెట్టి సత్తుపల్లి వెళ్లాడు. మధ్యాహ్నం సత్తుపల్లి నుంచి తిరిగొచ్చి చూడగా బైక్ కన్పించలేదు. దీంతో బైక్ చోరీకి గురైనట్లు భావించి రమేష్ తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 18: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖమ్మంపాడు సమీపంలోని వాగు నుంచి అశ్వారావుపేటకు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి డ్రైవర్లు బత్తుల వెంకన్న, ఇనుమురి చిలకరాజు, తాళ్లూరి దుర్గారావు, తాళ్లూరి శ్రీనుతో పాటు ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి వాహనాలను సీజ్‌చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ వివరించారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెనుబల్లి, సెప్టెంబరు 18: మండలంలోని సూరయ్యబంజర్‌లో ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వీఎం బంజర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన దారావత్ గోపాలస్వామి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారం మేరకు ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేయగా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈమేరకు గోపాలస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డబ్బుల కోసం భార్యతో గొడవపడి ...

కరకగూడెం, సెప్టెంబరు 18: మండలంలోని అశ్వాపురంపాడు వలస గొత్తికోయ గ్రామానికి చెందిన కోవాసి సురేష్(37) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగిన విషయం విధితమే.. బుధవారం మృతుని తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.. మృతుడు సురేష్ డబ్బుల విషయంలో బార్యతో గొడవపడి మనస్థాపం చెంది క్షణికావేశంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తెలిపారు.

వంట నూనె ట్యాంకర్ చోరీ..

- గ్రామాల్లో లూజ్ విక్రయాలు
- పోలీసుల రాకతో పరార్...

ఎర్రుపాలెం, సెప్టెంబరు18: ఏపీలోని నందిగామ నుంచి వంట నూనె ట్యాంకర్‌ను దొంగిలించి మండలంలోని కంఢ్రిక గ్రామంలో వంట నూనెను తక్కువకు అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నందిగామ గ్రామంలో వంటనూనే వ్యాపారి చలపాటి పార్థసారధి ఇంటినుంచి గుర్తుతెలియని వ్యక్తులు అయిల్‌ట్యాంకర్‌ను దొంగిలించారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని మొరుసుమిల్లి గ్రామంలో ఓ పెట్రోల్‌బంక్ దగ్గర ఆపి ట్యాంకర్ తాళాలను పగులగొట్టి మొరుసుమిల్లి, వెంకటాపురం, జమలాపురం, కంఢ్రిక గ్రామాల్లో చౌకధరకు వంట నూనెను విక్రయించారు. కంఢ్రిక గ్రామం వద్ద స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులను చూసిన దొంగలు పరారయ్యారు. ట్యాంకర్‌ను పోలీసులుస్వాధీనం చేసుకున్నారు. కాగా నూనె ట్యాంక్‌లోని నాలుగు అరల్లో 12వేల చొప్పున మొత్తం 48వేల లీటర్ల నూనె ఉంది. అందులో ఒక అర తాళాన్ని ధ్వంసం చేసిన దొంగలు గ్రామాల్లో సుమారు 500 లీటర్ల వరకు విక్రయించారు. ఈ లెక్కన సదరు వ్యక్తులు సుమారు 50వేల వరకు దండుకున్నారు. బాధితుడు నందిగామ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని వివరాలు తెలుసుకుని బాధితుడి ట్యాంకర్‌ను అప్పచెప్పినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.


క్యాన్లు, బకెట్లతో వంటనూనె కొనుగోలు చేస్తున్న స్థానికులు

9 మందిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నమోదు

- మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరు, సెప్టెంబరు 18: ఓ వితంతు మహిళలను కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమెపై దాడికి పాల్పడిన ఘటనలో తొమ్మిది మందిపై మణుగూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. మణుగూరులోని రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసముండే మర్రి రజిత ఇదే ప్రాంతంలో నివాసముండే చింతా గాయత్రి వద్ద తన భర్త ఆరోగ్యం బాగో లేదని రూ.లక్ష అప్పుగా తీసుకుంది. నెలకి ఐదు వేల చొప్పున వడ్డీ కడుతోంది. కొంత కాలం క్రితం రజిత భర్త సురేష్, మృతి చెందాడు. ఇల్లు గడవడమే కష్టంగా మారిన రజితను తమ అప్పు చెల్లించాల్సిందే అంటూ గాయత్రీ ఆమె కుటుంబ సభ్యులు ఇంటిపైకి వచ్చి గొడవ పడి, అప్పుకింద భర్త ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారు. మిగిలిన 30 వేల కోసం గత ఆదివారం మధ్యాహ్నం రజిత ఇంట్లో ఉండగా చింతా గాయత్రి , బూర్ల స్వరూప, ఉజ్వల చింత రాము, బూర్ల సతీష్‌లతో పాటు ఇదే ప్రాంతంలో ఉండే గురజాల గోపి, వచ్చి కులంపేరుతూ తిడుతూ ఇంట్లో ఉన్న సామగ్రి అంతా చిద్రం చేశారు. ఈ క్రమంలో అడ్డుకునే ప్రయత్నం చేయగా రజితను తిడుతూ కొట్టారు. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తున్న రజితను అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అక్షర మహిళా మండలి కార్యాలయం లోకి బలవంతంగా తీసుకెళ్లి కూర్చోబెట్టి పై ఆరుగురితో పాటు మణుగూరుకు చెందిన లెనిన్, రామారావు, పాపారావు కలసి తెల్లకాగితంపై సంతకం పెట్టించారని రజిత పోలీసులకు ఇచ్చినఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.

ఆ రోజు లేని అభ్యంతరాలు ఈరోజెందుకు..?

- ఖగోళ యాత్రకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నాం
- తమ సంస్థ పై బురద జల్లడం మంచిది కాదు
- లోక కల్యాణం కోసమే ఖగోళయాత్ర
- శ్రీ రామా టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ నిర్వాహకులు

భద్రాచలం, సెప్టెంబరు 18: తాము నిర్వహించిన ఖగోళయాత్రకు రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి అన్ని అనుమతులు తీసుకున్నామని, ఆ రోజులేని అభ్యంతరాలు ఈరోజు ఎందుకు వచ్చాయని శ్రీరామా టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఖగోళయాత్ర నిర్వాహకులు అర్చకం పద్మనాభచార్యులు ప్రశ్నించారు. భద్రాచలంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో తాము నిర్వహించిన కార్యక్రమానికి దేవాదాయ శాఖ, ఇతర శాఖల అధికారులు కూడా వచ్చారని గుర్తు చేశారు. రాముడు అంటే సత్యానికి ధర్మానికి నిదర్శనమని లోక కల్యాణం కోసం ఖగోళ యాత్ర నిర్వహించామని అలాగే అమెరికాలో రామాలయం నిర్మిస్తున్నామని అన్నారు. దేవాలయ నిర్మాణం అంటేనే భక్తుల విరాళాలతో సహాయ సహకారాలతో ఉంటుందని తెలిపారు. తాము ఎప్పుడు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం పేరును దుర్వినియోగ పరచలేదని తెలిపారు. భద్రాద్రి దేవస్థానం పేరు చెప్పి విరాళాలు వసూలు చేశామన్నది పూర్తిగా అసత్యమైన ఆరోపణ అని, దయచేసి ఇటువంటి ఆరోపణలు మానుకోవాలని కోరారు.

ప్రపంచం నలుమూలల ఉన్న శ్రీరాముని భక్తుల మనోభావాలు భద్రాది దేవస్థానం వారు దెబ్బతీస్తున్నారని శ్రీరాముని సేవలో తరిస్తున్న మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూడడం సరికాదన్నారు. మంగళవారం భద్రాచలంలో నిర్వహించిన శ్రీరాముల వారి కల్యాణం ను తిలకించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు భద్రాచలానికి వచ్చారని ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ప్రోత్సాహం అందించకపోగా నిందలు, ఆరోపణలు చేయడం అర్ధరహితమన్నారు. భద్రాద్రి శ్రీరామా టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ అని పేరు పెట్టడంలో ఎటువంటి తప్పులేదని, అలాగే న్యాయపరమైన సమస్యలు కూడా లేవవని, దయచేసి తమ సంస్థపై బురద చల్లడం మంచిది కాదని అన్నారు.

పాముకాటుతో వ్యక్తి కన్నుమూత

వేంసూరు, సెప్టెంబరు 18: పాముకాటుతో ఓ వ్యక్తి మృతిచెందిన దుద్దుపూడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మోరంపూడి సత్యనారాయణ(63)బుధవారం సాయంత్రం పొలంలోకి వెళ్లి పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో చుట్టుపక్కల రైతులు గమనించి సత్యనారాయణను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

చింతకాని, సెప్టెంబరు 18: మండల పరిధిలోని వందనం గ్రామంలో బుధవారం వినాయకుని నిమజ్జనం సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వర్గానికి చెందిన వ్యక్తులు, మరో వర్గానికి చెందిన ఊరేగింపు బృందంలో పాల్గొనడంతో వివాదం చెలరేగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమనిగింది.

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 18: ఖమ్మం జిల్లా రూరల్ మండలం గుండాల తండాలో బుధవారం మనస్థాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల తండా గ్రామానికి చెందిన భూక్యా లావణ్య(17) ఖమ్మం ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సం చదువుతూ హస్టల్‌లోనే ఉంటోంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం సెలవుల్లో లావణ్య ఇంటికి వచ్చింది. అయితే ఇదే గ్రామానికి చెందిన అజ్మీరా గోపి అనే వ్యక్తి లావణ్యతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని అనుమానంతో గోపి భార్య అజ్మీరా రేణుక, ఆమె తల్లి అజ్మీరా చాసు కలిసి గోపిని వెంట తీసుకెళ్లి లావణ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో వచ్చి ఆమెను తిట్టి వెళ్లిపోయారు. దీంతో మనస్థాపం చెందిన లావణ్య ఈనెల 16న ఇంట్లో ఉన్న పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. లావణ్య మృతికి గోపి, రేణుక, చాసులే కారణమని ఆమె కుటుంబ సభ్యులు లావణ్య మృతదేహన్ని గోపి ఇంటి ముందు పెట్టి ధర్నా నిర్వహించారు. లావణ్య మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామపెద్దలు ఇరువర్గాల వారితో మాట్లాడారు. లావణ్య తండి మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని విశ్రాంత ఉద్యోగి..


ఖమ్మం రూరల్, సెప్టెంబరు 18: ఉరివేసుకుని విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం పంచాయతీ పరిదిలోని ఆదిత్యటౌన్‌షిప్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్యంతో సింగరేణి ఉద్యోగం నుంచి వైదొలగిన ఊసుకోయల వెంకటరాజు(61) తన భార్యతో కలిసి ఏదులాపురం పంచాయతీ ఆదిత్యటౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నాడు. అనారోగ్యంతో పాటుగా దూమపానం, మద్యానికి అలవాటు పడ్డాడు. ఇంటోని వారు ఎన్నిసార్లు వారించినా దూమపానం, మద్యం మానివేయలేదు. అనారోగ్యం బాధను తట్టుకోలేక, మద్యం మత్తులో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతిచెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని, సెప్టెంబరు 18: మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో ఈ నెల 16న వినాయక నిమజ్జన సమయంలో ముగ్గురు వ్యక్తులు తన ఇంటి పైకి వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించారని గ్రామానికి చెందిన కంచుమర్తి సీతారామయ్య పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి దండా ఉపేందర్, సాయి, పుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

హాస్పిటల్ భవనంలో మంటలు

- తప్పిన పెనుప్రమాదం


ఎగిసిపడుతున్న మంటలు

వైరా, సెప్టెంబరు 18: వైరా మునిసిపాలిటీ ఐదో వార్డులో సొసైటీ కార్యాలయానికి పక్కనే ఉన్న శారదా నర్సింగ్ హోమ్ పైనున్న ఒక నివాస భవనంలో కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే మునిసిపాలిటీలోని ఒక కరెంట్ ఉద్యోగి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ సరఫరా నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పిపోయింది. ఆసుపత్రికి పైన నివాసముంటున్న వారు నీళ్ల కోసం కరెంట్‌మోటార్ స్విచ్‌ను ఆన్‌చేయగానే అక్కడున్న మెయిన్‌లోనుంచి మంటలు చెలరేగాయి. దాంతో నివాసముంటున్న మహిళలు భయకంపితులయ్యారు. కొన్ని నిమిషాల పాటు మంటలు ఎగసిపడి దట్టమైన పొగ అలుముకుంది. అదే సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేయడంతోపాటు ఆసుపత్రిలో ఉన్న అగ్నిమాపక పరికరంతో మంటలు ఆర్పివేశారు. దాంతో ప్రమాదం తప్పిపోయింది. సమాచారం తెలిసిన వెంటనే ఫైర్ ఆఫీసర్ అమరనేని శ్రీనివాసరావు, హుటాహుటిన అగ్నిమాపక సిబ్బందిని సంఘటనాస్థలానికి పంపించారు. అక్కడ జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన పెట్రోడీలర్లు


కలెక్టర్‌ను కలిసిన పెట్రో డీలర్లు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 18: ఇటీవల వచ్చిన వరదలో నాయకన్‌గూడెంలో గల ఎస్ఎస్ఎల్‌వీ ఆటో సర్వీసెస్ పెట్రోల్ బంక్ పూర్తిగా ధ్వంసం అయినది. ప్రభుత్వం డీలర్ ని ఆదుకోవాలని ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కలెక్టర్ ముజామిల్ ఖాన్ కలిశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం తరుపున సాయం అందేలా చర్యలు తీసుకుంటా అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రగడ రంగనాథ్, జనరల్ సెక్రటరి కూరపాటి మంజుల,కోశాధికారి వజినేపల్లి శ్రీనివాస్, రవికుమార్, ఉపాధ్యక్షులు కొనా జనార్ధనరావు, సన్నె ఉదయ్ ప్రతాప్, జాయింట్ సెక్రటరీ వెగ్గలం శ్రీనివాస్,మద్ది పెట్టినయ్య దమ్మలపాటి నగేష్,ఈసి మెంబర్స్ అద్దంకి విప్లవ్ కుమార్, బానోత్ రామ్మూర్తి , ఎమ్. దిలీప్ రెడి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

- నేలకొండపల్లి మండలంలో టీడీపీ బృందం పంటల పరిశీలన
- రైతులను ఆదుకోవాలని డిమాండ్
- రాకాసితండా వరద బాధితులకు సుభాష్ చంద్రబోస్ ట్రస్ట్ సాయం


సుర్దేపల్లిలో మేట వేసినపొలాలను పరిశీలిస్తున్న టీడీపీ బృందం

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/ఎర్రుపాలెం, సెప్టెంబరు 18: ఈనెల 2న వచ్చిన వరదలకు కొట్టుకు పోయిన పొలాలను బుధవారం తెలుగుదేశం బృందం పరిశీలించింది. బాధిత రైతులను టీడీపీ నాయకులు ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మండల పరిధిలోని సుర్దేపల్లి, రామచంద్రాపురం, బుద్దారం ప్రాంతాల్లో వరదలకు నాట్లు కొట్టుకుని పోయి, పొలాల్లో ఇసుక మేటలు వేసిందని, పొలాలు ఇసుక దిబ్బలను తలపిస్తున్నాయని టీడీపీ నాయకులన్నారు. ఇప్పటికే పొలాలపై వేలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టారని, పెట్టుబడి అంతా నీటిలో కలిసిపోయిందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, ఎకరాకు కనీసంగా రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేసారు. పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్, నాయకులు ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, నలమాస మల్లయ్య, గడుపూడి వెంకటేశ్వరరాఉ, తాటికొండ నాగేశ్వరరావు, నూక హనుమంతరావు, వీసం శ్రీను, గోగినేని సీతారాం, కోలేటి మస్తాన్‌రావు, కాసాని బడేసాబ్, దుడ్డెల గోపాలరావు రాజు, భిక్షం, భూపతి, గోవిందు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ఇటీవల కురిసిన భారీవర్షంతో మండలంలోని రాకాసితండాలో సర్వం కోల్పోయిన బాదితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రాయల సుభాష్ చంద్రబోస్ ట్రస్టు కార్యదర్శి వుసులూరి నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాకాసితండా వరద బాదితులు 80 కుటుంబాలకు ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ ఆకేరు వరదతో రాకాసితండా ప్రజలు సర్వం కోల్పోయి ప్రభుత్వం సాయం కోసం ఎదురు చూస్తున్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అన్నారు. వరదలతో ఇక్కడి ప్రజలు ఇళ్లు కోల్పోయారని, సారవంత మైన భూములు ఇసుక మేటలు వేసి పనికిరాకుండా పోయాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు రూ.5లక్షలు పరిహారం అందించాలన్నారు. అలాగే రైతులను ఆదుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గుర్రం అచ్చయ్య, మాస్‌లైన్ జిల్లానాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు ఆర్. శివలింగం,తిమ్మి డి హనుమంతరావు, రామారావు, కూసు అప్పారావు, పి.వెంకటస్వామి, ఎస్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నిరసన

ఎర్రుపాలెం, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వరద బాదితులకు నష్టపరిహారం అందించాలని బాదితులతో కలిసి ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు అనతరం తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందించారు. ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కూరపాటి ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ మండలంలోని చొప్పకట్లపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో వరద బాదితులకు నష్టపరిహారం అందించడంలో అన్యాయం జరిగిందని, నష్టపోయిన వారికి తక్షణమే న్యాయం చేయాన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి రత్నాకర్‌మాదిగ, నాయకులు సగ్గుర్తి శ్యాంప్రసాద్‌మాదిగ, పల్లెకంటే సుధీర్‌మాదిగ, బొక్క రమేష్‌మాదిగ, పల్లెకంటే సత్యం, వడ్డకుంటి సామేలు, బాబురావు పాల్గొన్నారు

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ


రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముదిగొండ, సెప్టెంబరు 18: రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ముదిగొండ మండలంలోని ముత్తారం, ముదిగొండ గ్రామాల్లో ఆకస్మికంగా ఆమె పర్యటించారు. ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అన్నిరకాల వైద్యసేవలందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో చేస్తున్న పరీక్షల వివరాలను పరిశీలించారు. ఆతర్వాత రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించి గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముత్తారంలోని పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో కావల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏడీ నాగేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ అరుణదేవి, సెక్రటరీలు రామకృష్ణ, గౌతమి పాల్గొన్నారు.

పల్లెల నుంచి పట్టణాల వరకు స్వచ్ఛతాహీ సేవా 2024 ప్రారంభం


పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, రఘునాథపాలెం,సెప్టెంబరు 18: పల్లెల నుంచి పట్టణాల వరకు చిన్న, పెద్ద హోదాలతో సంబంధం లేకుండా ప్రభుత్వశాఖల అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతాహి సేవా 2024-2025 పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో రైతు బజార్‌లను అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ ఊడ్చీ శుభ్రం చేశారు. 60 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: ఈడీ

చింతకాని, సెప్టెంబరు 18: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. లచ్చగూడెం ప్రభుత్వ పాఠశాలను జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి కేశవపట్నం రవి కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ

వైరా, సెప్టెంబరు 18: పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడతామని వైరా మునిసిపాలిటీ ప్రతిజ్ఞభూనింది. పర్యావరణాన్ని పరిరక్షించి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని వైరా మునిసిపాలిటీలో విజయవంతం చేసేందుకు తామంతా కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. బుధవారం వైరా మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ చింతా వేణు స్వచ్ఛభారత్ విజయవంతం కోసం సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. మునిసిపాలిటీలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛభారత్ ద్వారా గాంధీజీ కన్న కలలను నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా సేవ చేయాలని కమిషనర్ కోరారు. మునిసిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల కార్యవర్గం ఎన్నిక

వైరా, సెప్టెంబరు 18: రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం వైరా మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మాధవరావు (వైరా జీహెచ్ఎస్), విజయబాబు(గొల్లపూడి హైస్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల వీరస్వామి, బుగ్గినేని నాగేశ్వరరావు, పరిశీలకులు కె.మార్క్ ప్రభాకర్ పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వైరా బాలికోన్నత, సిరిపురం, గరికపాడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లీశ్వరి, సూర్యకుమారి, చావా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో మెడికల్ విద్య భారమే

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 18: డీమ్డ్ యూనివర్శిటీల వల్ల రానున్న రోజుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెడికల్ విద్య భారంగా మారునున్నదని డాక్టర్ మెడికల్ అకాడమి డైరెక్టర్ రాయల సతీష్‌బాబు అన్నారు. బుధవారం అకాడమిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రతి ప్రవేశం మెడికల్ కాలేజి డీమ్డ్ యూనివర్శిటి బాట పట్టడం తధ్యమని, కేవలం ధనవంతులకే మెడికల్ విద్య అందుతుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ నగరంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మసీదు నిర్మాణానికి రూ.లక్ష విరాళం

- కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ఔదార్యం


మసీద్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వెంకటరమణ

ఖమ్మం సంక్షేమవిభాగం సెప్టెంబరు 18: కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలలో ముందుండే 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ మరోసారి తన ఔనత్యా న్ని చాటుకున్నారు. 44వ డివిజన్‌లో నిర్మాణం జరగనున్న మసీదుకు బుధవారం రూ.లక్ష విరాళం ప్రకటించారు. మసీదు శంకుస్థాపన కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలతో కలిసి పాల్గొన్నారు. మసీదు శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా హజ్రత్ మౌలానా మహమ్మద్ అబ్దుల్‌ఖని, విశిష్ట అతిథులుగా మహమ్మద్ జలాలుద్దీన్, మహమ్మద్ సయిద్ అహ్మద్, ఖమ్మం టౌన్ మసీదు పెద్దలు, పూలవ్యాపారుల గౌరవ సలహాదారులు షైముద్, షేక్ సర్ధార్, పూల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మోయిన్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త ఆటోలు రాకుండా కందకం తవ్విన రైతులు

వైరా, సెప్టెంబరు 18: వైరా జాతీయ ప్రధాన రహదారిలోని వైరా నదిలో మునిసిపాలిటీ చెత్త వేయకుండా నిలువరించేందుకు చెత్త వాహనాల రాకపోకలను అడ్డుకుంటూ స్టేజీ పినపాక, గండగలపాడు రైతులు ఏకంగా కందకం తవ్వారు. వైరా మునిసిపాలిటీలోని టన్నులకొద్దీ చెత్తను వాహనాలు తీసుకువెళ్లి వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెన సమీపంలో రోడ్డు పక్కన అలాగే వంతెన కిందిభాగంలో వేస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలతో చెత్త మొత్తం కొట్టుకుపోయి రైతుల పొలాల్లో మేట వేసి తొలగించేందుకు కూడా వీల్లేకుండాపోయింది. అంతేకాకుండా జాతీయ ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతుంది. దీనికి నిరసనగా స్టేజీపినపాక, గండగలపాడుకు చెందిన రైతులు, ఇతర వర్గాల వారు మంగళవారం గండగలపాడు వద్ద చెత్త ఆటోలను అడ్డుకొని ఆతర్వాత మునిసిపల్ కార్యాలయానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆవెంటనే ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు అంచుకు కందకం తవ్వించారు. విధిలేని పరిస్థితుల్లో మునిసిపాలిటీ చెత్తను బుధవారం వైరా రిజర్వాయర్ అలుగుల సమీపంలో నదిలో వేశారు.

ప్రభుత్వమే సంక్షేమాన్ని అందించాలి

వైరా, సెప్టెంబరు 18: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా నేరుగా అందించాలని, ప్రైవేట్ బీమా కంపెనీలకు కట్టబెట్టవద్దని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం వైరాలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ వైరా ప్రాంతీయ కమిటీ కార్యదర్శి యలదండి బాబు ఆధ్వర్యంలో కార్మికుల సంతకాలు చేశారు. నాయకులు గొలుసు నాగేశ్వరరావు, బద్రీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఏన్కూరు, సెప్టెంబరు 18: ఏన్కూరు గురుకుల విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారి ఆర్.సాయినాద్ సందర్శించారు. వంటగది, భోజనశాల, తరగతి గదులను, డార్మెటరి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి పాఠశాల సమస్యలను వివరించారు ఎంపీడీవో ఎస్.రమేస్, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ప్రిన్సిపాల్‌తుడి శ్రీనివాసరెడ్డి, డిప్యుటీవార్డెన్ విశ్వేశ్వరావు,ఏటీపీ సునిల్, వేమురాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 18: ఇటీవల మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కుటుంబాలకు భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం తన కార్యాలయంలో బాదిత కుటుంబాలకు అందించారు. ఎర్రుపాలెం పోలీసుస్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఆర్.కోటేశ్వరరావు, సత్తుపల్లి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన కానిస్టేబుల్ టి.బాబు కుటుంబాలకు ఈచెక్కులను సీపీ అందించారు.

రుణమాఫీ కుటుంబ నిర్ధారణకు వచ్చిన రైతులు

కల్లూరు, సెప్టెంబరు 18 కల్లూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతుల కుటుంబ నిర్ధారణకు నిర్వహించిన గ్రూప్ మ్యాచింగ్ ఫోటో కార్యక్రమానికి వందల సంఖ్యలో రైతు కుంటుంబ సభ్యులు వచ్చారు. రైతు వేదిక ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏవో రూప ఆధ్వర్యం లో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నీరజదేవి కుటుంబ సభ్యులు కూడా గ్రూప్ మ్యాచింగ్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు సమగ్రంగా పరిహారం

- దరఖాస్తుదారులతో కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18: మున్నేరు వరద ముంపు బాధితులకు సమగ్రంగా ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందుతుందని, ఎవరూ ఆదైర్యపడాల్సిన అవసరం లేదని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధితులకు చెప్పారు. బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థకు మున్నేరు వరద బాధితులమంటూ పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు చేరుకున్నారు. దీంతో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వారితో కమిషనర్ మాట్లాడారు. తొలి విడతలో సర్వే జరిగిన బాధితుల్లో ఇంకా కొంతమందికి బ్యాంకుల నుంచి పరిహారం జమ కావాల్సి ఉందని, అయా బ్యాంకులకు డబ్బులు పంపిణీ చేసినా ఇంకా బాధితుల బ్యాంకు ఖాతాలకు చేరలేదన్నారు. ఈ నెల 22వరకు మున్నేరు వరద బాధితులు పరిహారం కోసం ఎదురు చూడాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18: గురువారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సత్తుపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శరత్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లలితకుమారి ఆసుపత్రి రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన ఉండాలి


విద్యార్థులతో హార్వెస్ట్ పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి సెప్టెంబరు 18: విద్యార్థి సంఘ నాయకులుగా ఉన్నప్పటి నుంచే ప్రతి ఒక్కరికి మన హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ అన్నారు. బుధవారం పాఠశాలలో నమూనా ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థినాయకులు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్వెస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటి చైర్మెన్ డాక్టర్ యలమంచలి నాగమణి, విద్యా సంస్థల కరస్పాండెంట్ పి రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి హజరై మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి నాయకులని, నాయకుడి లక్షణాలు ఎలా పెంపొందించుకోవాలో గెలుపొందిన విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు సేవారంగాల్లో సమాజ అభ్యున్నతిలో పాలుపంచుకోవాలని అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైన విద్యార్థులను అభినందించారు.

పెనుబల్లి ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, సెప్టెంబరు 18: పెనుబల్లి సీహెచ్‌సీ ఆసుపత్రిని ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌లో పరీక్షలు చేసేందుకు మరో టెక్నీషియన్‌ను నియమించాలని, గైనకాలజిస్టును నియమించాలని, సెక్యూరిటీ సిబ్బంది ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు ఆమె దృష్టికి రాగా వారి డిప్యూటేషన్‌ను రద్దు చేసి కొత్తవారిని నియమించాలని కోరారు. దీంతోపాటు సీపీఎం జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు, పౌరహక్కుల సంఘం నాయకుడు కాటినేని శ్రీనివాసరావు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతరామారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ముందంజలో ఉండాలి: ఎంపీడీవో

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18: సత్తుపల్లి మండలం అభివృద్ధి పనులలో ముందంజలో ఉండాలని మండల ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించి సమీక్ష సమావేశంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడి నివేదికలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్‌సీహెచ్.నాగేశ్వరరావు, పీఆర్ డీఈ వెంకటేశ్వరరావు, ఏవో వై.శ్రీనివాసరావులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్య శాఖ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం ఓటర్ల జాబితాపై అన్ని పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

వ్యవసాయ కూలీలకు రూ.4వేలు పింఛన్ ఇవ్వాలని ధర్నా

ఖమ్మంటౌన్,- సెప్టెంబరు18: వ్యవసాయ కూలీలకు రూ.4వేలు పింఛన్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు వ్యవసాయ కూలీలకు వెంటనే పింఛన్ సౌకర్యం కలిగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు, నాయకులు పగిళ్ల వీరభద్రం, బానోత్ రామ్మూర్తి,పిట్టల రాంబాబు, మేళ్లచెరువు వీరబాబు, కాసినబోయిన అయోధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం వితరణ

కొణిజర్ల,సెప్టెంబరు18: మండల పరిధిలోని తనికెళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన నేషనల్ అంపైర్ తుప్పతి మల్లికార్జున్ సోదరుడు వెంకటరెడ్డి జ్ఞాపకార్థం స్పోర్ట్స్ యూనిఫామ్‌ను వితరణ చేశారు. ఈ యూనిఫాంను మల్లికార్జున్ బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అబ్రహం, పాఠశాల పీడి దొండపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు18: ఖమ్మంపట్టణంలో చెరువుల, కుంటలు, నాళాలపై అక్రమంఆ నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని బీఎస్పీ నాయకులు కోరారు. ఈమేరకు నగరంలోని జడ్పీసెంటర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ ఖమ్మంపట్టణ పరిసరాలలోని చెరువులపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వర్షాలు కురిసినప్పుడు ఆప్రాంతాలలో నీరు బయటకు వెళ్లే వీలులేకుండా పోతుందన్నారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బి.ఉపేందర్, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య అయితగాని శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ తీరు అప్రజాస్వామికం

- డీసీసీ ఆధ్వర్యంలో కేంద్ర దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీరు అప్రజాస్వామికంగా ఉందని డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. రాహుల్ గాంధీపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బుధవారం ఖమ్మంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీని చంపేస్తామని బెదిరింపులు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పల్లేబోయిన చంద్రం బారతి, మిక్కిలినేని మంజుల, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, హుస్సెన్, బాణాల లక్ష్మణ్, అబ్బాస్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, సెప్టెంబరు 18 ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని క్రైస్తవ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలిని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు ఏఐసీసీ నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ (ఏఐసీసీ) రాష్ట్ర అధ్యక్షులు పి ఎనోషకుమార్ ఆధ్వర్యంలో ఆ సఘం నాయకులు కార్పొరేషన్ చైర్మన్ కలిసిశారు. కార్యక్రమంలో ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్నాసి బాలరాజు, మీడియా సెల్ అధ్యక్షుడు దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్, గౌరవ సలహాదారు తేళ్లూరి సంజీవరావు, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు లక్ష్మీపురం రైతులు వినతి

కొణిజర్ల, సెప్టెంబరు 18: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొతమంది రైతులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పొలాలకు వెళ్లే రహదారికి కొందరు వ్యాపారులు ఆక్రమించి పెన్సింగ్ వేశారని, గతంలో అధికారులు పెన్సింగ్‌ను తొలగించిన మరల వశారని పిర్యాదు చేశారు. ఇంజక్షన్ ఆర్డర్‌ను కూడ అతిక్రమించి రహదారికి పెన్సింగ్ వేశారని పిర్యాదులో పేర్కొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత

కొణిజర్ల,సెప్టెంబరు18: కొణిజర్ల సూపర్‌జెమ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఇటీవల వరదలకు నష్టపోయిన ఖమ్మం వరదబాధితుల సహాయార్థం విరాళాలను సేకరించారు. మొత్తం రూ. 35వేలను సేకరించారు. ఈ నగదును పాఠశాల ప్రిన్సిపాల్ కొనతం ఉమాశంకర్ చెక్కుగా మార్చారు. ఈ చెక్కును బుధవారం విద్యార్థులతో కలిసి కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

బోనకల్, సెప్టెంబరు 18: ఎన్నికల్లో ఇచ్చిన హామిలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ఆరోపించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధవారం జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికి 2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, కొంగర వెంకట నారాయణ, కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

కామేపల్లి, సెప్టెంబర్ 18: కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డా. చంద్‌నాయక్ ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఔషదాలను తనిఖీ చేశారు.

శ్రీ వైష్ణవ కుటుంబాలకు ఆర్థికసాయం


శ్రీవైష్ణవ కుటుంబాలతో శ్రీవేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి

ఖమ్మంటౌన్,- సెప్టెంబరు 18: ఇటీవల మున్నేరుకు వచ్చిన వరదలతో సర్వం కోల్పోయిన శ్రీవైష్ణవ కుటుంబాలకు శ్రీవేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి అండగా నిలిచింది. బుధవారం జలగంనగర్‌లోని 20కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. వరద ముంపులో సర్వం కోల్పోయిన శ్రీ వైష్ణవ కుటుంబాలకు ఇటీవల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సహకారంతో నిత్యావసరాలను అందించిన శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీవైష్ణవి సేవాసమితి తాజాగా దాతలను సహాయం అడిగి, జలగంనగర్‌లోని శ్రీవైష్ణవ కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. 10నెలల క్రితం ఏర్పడిన సేవాసమితి పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు బోధనం పరాంకుశం, కార్యదర్శి తిరునగిరి నరసింహం, సంయుక్త కార్యదర్శి దాశరధి వేంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాధ్యులు తిరునగిరి రమణ, తాళ్లూరి పద్మజాదేవి, ఎస్‌పీ. చైతన్య, రామాయణం శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముంపు విద్యార్థులకు దుస్తులు, నోటు పుస్తకాల పంపిణీ

ఖమ్మం రూరల్: మండల పరిధిలోని తీర్థాల ప్రాథమికోన్నత పాఠశాల కు చెందిన వరద ముంపు విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ దుస్తులు పంపిణీ చేశారు. మున్నేరు వరద ముంపునకు గురైన 72 మంది విద్యార్థులకు సొసైటీ దుస్తులను అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి డీఈఓ కార్యాలయం సీఎంఓ రాజశేఖర్ నోటు పుస్తకాలు పెన్నులు పెన్సిలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం.జాకబ్, సంస్థ ప్రతినిధులు ఏ పుల్లారావు, సతీష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

తిరుమలాయపాలెం,సెప్టెంబరు18:ఇటీవల సంభవించిన భారీ వరదలకు తీవ్రంగా నష్టపోయిన మండల పరిధజలోని రాకాసితండాలోని 80 కుటుంబాలకు విశ్రాంత లేబర్ ఇన్‌స్పెక్టర్ చనుమోలు విజయలక్ష్మి బుధవారం దుస్తులను పంపిణీ చేసారు.

నిత్యావసరాలు పంపిణీ

ఏన్కూరు: ఏన్కూరు బైబిల్ మిషన్ సంఘం కామాల అద్భుత కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం పట్టణంలోని వరదబాదితులకు నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. మోతీనగర్ ప్రాంతంలోని 50కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవకురాలు స్వప్న, అనురాగ్ అజయ్, కిరణ్‌ప్రసాద్, బ్రదర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కన్నుల పండుగగా గణేష్ నిమజ్జనం


నిమజ్జన వేడుకలలో పాల్గొన్న సీపీ సునీల్‌దత్

వైరా/కల్లూరు/ ఖమ్మం క్రైం, సెప్టెంబరు 18: వైరా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణేష్ విగ్రహాన్ని బుధవారం కన్నుల పండుగగా నిమజ్జనం చేశారు. స్థానిక వాసవీ కల్యాణ మండపం నుంచి కోలాట నృత్యాలు, బ్యాండ్‌మేళాలు, బాణాసంచా మోతలతో వైరా ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. లడ్డూ వేలంపాటలో రూ.52వేలకు కొణతాలపల్లి నగేష్, హుండీ వేలంపాటను రూ.26వేలకు మిట్టపల్లి కిరణ్ దక్కించుకున్నారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని గన్నవరం-దాచాపురం మధ్య ఉన్న వైరా నదిలో నిమజ్జనం చేశారు. అలాగే వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీకి చెందిన గణేష్ విగ్రహాన్ని కూడా ఊరేగించి నిమజ్జనం చేశారు.

కల్లూరు: మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో వినాయక నిమజ్జన ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి వారి నగర్‌లో గణేష్ మండపం వద్ద లడ్డూ వేలం పాటను యాదాద్రి పవర్‌ప్లాంట్ ఇఇ జంగిలి దుర్గాప్రసాద్ రూ. 26 వేలకు దక్కించుకున్నారు. అనరంతరం గణేష్ నిమజ్జన శోభయాత్రను మహిళ భక్తుల నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినర్జీ ఆగ్రోస్ అధినేత కర్నాటి వెంకటరెడ్డి, గణేష్ మండపం ఉత్సవ కమిటీ నిర్వహకులు తలపురెడ్డి రత్నాలరెడ్డి, కర్నాటి జయ బాబురెడ్డి, హనీమిరెడ్డి, చెన్నారెడ్డి, ఆశోకోరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కప్పలబంధంలో లడ్డూ వేలంలో దక్కించుకున్న యాదాద్రి పవర్ ప్లాంట్ ఈఈ

నిమజ్జనంలో పాల్గొన్న సీపీ

ఖమ్మం క్రైం: గణపతి నవరాత్రుల ఉత్సవాల అనంతరం పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లోని గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఫ్యామిలీ క్వార్టర్స్‌లో ఊరేగింపు చేశారు. పోలీస్ కుటుంబాలతో పాటు శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు, ట్రైనీ కానిస్టేబుళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రకాష్‌నగర్ మున్నేరు వద్ద నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సునీల్ సింగ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కామరాజు, నాగేశ్వరరావు, సాంబశివరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.